## రామాలయాన్ని దర్శించిన
# శ్రీలంక దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి



**భద్రాచలం కల్చరల్ , ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శ్రీలంక దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తి తురాయిరాజ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక బృందం ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం రామాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అదేవిధంగా బేడా మండపంలో దేవస్థానం తరపున వైదిక బృందం తురాయిరాజ్ దంపతులకు వేద ఆశీర్వచనం అందజేయడంతో దేవస్థానం తరపున శాలువ కప్పి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక బృందం పాల్గొన్నారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 28 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 7


**విద్యార్థిని మైనర్ కావడంతో గోప్యంగా ఉంచిన ఘటన వివరాలు**

2 లో..



## పాల్వంచలో దారుణం...
# గర్భం దాల్చిన మైనర్

పాల్వంచలో ఒక మైనర్ విద్యార్థిని గర్భం దాల్చడంతో టాబ్లెట్లతో సదర విద్యార్థిని ప్రాణాపాయస్థితిలో ఉన్న సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో ఈ ఘటన సంచలనానికి దారి తీసింది ,పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ కలిగిన ఒక కళాశాలలో చదువుతున్న ఒక మైనర్ విద్యార్థిని గర్భం దాల్చినట్లు సమాచారం.

● పాల్వంచ, ప్రజాజ్యోతి



## ఐటీడీఏ శిక్షణతో
# గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు

- డ్రోన్ సేవలు, డేటా నమోదు శిక్షణ పూర్తి చేసిన 15 మందికి ఉద్యోగావకాశాలు
- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్

**భద్రాచలం, ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి** : నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు తమ గ్రామాలకే పరిమితం కాకుండా విస్తృత అవకాశాలను అన్వేషించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సూచించారు. ఐటీడీఏ యువత శిక్షణ కేంద్రంలో 60 రోజులపాటు నిర్వహించిన డ్రోన్ సేవలు, ఎలక్ట్రిషియన్ మరియు డేటా నమోదు శిక్షణను పూర్తిచేసుకున్న యువతకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వ్యవసాయ విధానాలు మారుతున్నాయని, డ్రోన్ శిక్షణ పొందిన యువత రైతులకు ఆధునిక సాంకేతికత ప్రయోజనాలను వివరించి సేవలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగం పెరుగుతున్న

మిగతా 2 లో...

## దమ్మపేట మండలంలో అభివృద్ధి శంఖారావం

- మహిళా శక్తికి బలమైన మద్దతు, విద్యా వసతులకు భారీ ఊతం.... ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



2 లో...

# ఒత్తిడిని జయిస్తే విజయం



- ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు
- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు
- మార్చి 14 నుంచి పదో తరగతి పరీక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ,ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** పరీక్షల సీజన్ ప్రారంభమైంది. ఇప్పటి వరకు పుస్తకాలతో కష్టపడి చదివిన విద్యార్థులు ఇప్పుడు తమ భవిష్యత్తును నిర్ణయించే దశలోకి అడుగుపెడుతున్నారు. ఫిబ్రవరి 25నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మార్చి 14నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏడాదిపాటు శ్రద్ధగా చదివిన విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలంటే కొంత ఆందోళన, భయం కలగడం సహజమే. అత్యధిక మార్కులు, ఉత్తమ గ్రేడులు సాధించాలనే తపన ఒక వైపు, లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అనే సందేహం మరోవైపు మానసిక ఒత్తిడిని పెంచుతుంది. అయితే భయాన్ని జయించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### ››› పునఃశ్చరణే విజయానికి మార్గం

ఏడాది పొడవునా చదివిన పాఠాలను క్రమపద్ధతిలో పునఃశ్చరణ చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు. కొంతమంది విద్యార్థులు పరీక్షలకు ముందు గంటల తరబడి చదువుతూ నిద్రలేమికి

మిగతా 2 లో...

## ఐటీడీఏ శిక్షణతో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు



(మొదటి పేజీ తరువాయి...)

నేపథ్యంలో యువతకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలైన ఆరాధ్య ప్రైవేట్ లిమిటెడ్ భువనగిరి, ఎడిలిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు, రైట్ ఇన్నొవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలు ఉచిత భోజన వసతి మరియు నెలకు రూ.15 వేల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించాయని పేర్కొన్నారు. ఇప్పటికే 15 మంది యువతీ యువకులు ఆ సంస్థల్లో పనిచేయడానికి ముందుకు వచ్చినందుకు అభినందించారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులతో మమేకమై నిబద్ధతతో పనిచేస్తే భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉంటుందని సూచించారు. భవిష్యత్తులో గిరిజన యువత స్వయం ఉపాధి దిశగా చిన్న తరహా పరిశ్రమలు స్థాపించేందుకు ఐటీడీఏ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి సైదులు, వ్యవసాయ అధికారి సున్నం రాంబాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి హరికృష్ణ, కంప్యూటర్ విభాగం నిర్వాహకుడు గోపీనాథ్, సమాచార సాంకేతిక శిక్షకురాలు సులోచన, నైపుణ్య శిక్షకురాలు అరుణ, మొబిలైజర్ రాహుల్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

## దమ్మపేట మండలంలో అభివృద్ధి శంఖారావం

- మహిళా శక్తికి బలమైన మద్దతు, విద్యా వసతులకు భారీ ఊతం....ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



**దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** దమ్మపేట మండలాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా వేగంగా తీసుకెళ్లే సంకల్పంతో గౌరవ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం మండల వ్యాప్తంగా విస్తృత పర్యటన చేపట్టి పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. గ్రామీణ మౌలిక వసతుల బలోపేతం, మహిళా సాధికారతకు ప్రాధాన్యత, విద్యా ప్రమాణాల పెంపు తన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. మండల పరిధిలోని పూసుకుంట గ్రామపంచాయతీలో స్వయం సహాయక సంఘాల మహిళల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి, జీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అర్లపెంట గ్రామంలో మహిళా సంఘాల కమ్యూనిటీ భవనానికి పునాది వేశారు. పట్వారిగూడెం పంచాయతీ సుధాపల్లి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, రాచూరుపల్లి పంచాయతీ పాతలచ్చాపురం గ్రామంలో సీసీ రోడ్ల పనులకు శ్రీకారం చుట్టారు. జమేదార్ బంజర పంచాయతీ గుర్వాయిగూడెం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దమ్మపేట మండల కేంద్రంలోని అర్బన్ కాలనీలో నూతన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించి, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ముష్టిబండ పంచాయతీ అప్పారావుపేట గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వడ్లగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి, మారప్పగూడెం గ్రామంలో స్వయం సహాయక సంఘాల మహిళల కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అదే పంచాయతీ పరిధిలోని చీపురుగూడెం గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంకంపాలెం గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ఫేర్‌వెల్ డే కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులకు ఉత్సాహం నింపారు. గ్రామీణ బాలికల విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పాల్వంచలో దారుణం..
# గర్భం దాల్చిన మైనర్ విద్యార్థిని

- విద్యార్థిని మైనర్ కావడంతో గోప్యంగా ఉంచిన ఘటన వివరాలు



**పాల్వంచ, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి**

పాల్వంచలో ఒక మైనర్ విద్యార్థిని గర్భం దాల్చడంతో టాబ్లెట్లతో సదరు విద్యార్థిని ప్రాణాపాయస్థితిలో ఉన్న సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది, ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో ఈ ఘటన సంచలనానికి దారి తీసింది ,పట్టణంలోని ప్రముఖ విద్యా సంస్థ కలిగిన ఒక కళాశాలలో చదువుతున్న ఒక మైనర్ విద్యార్థిని గర్భం దాల్చినట్లు సమాచారం, అనంతరం గర్భస్రావం కోసం టాబ్లెట్లు వాడినట్లు కూడా తెలిసింది, దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి ఆమె ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లినట్లు సమాచారం, అత్యవసర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది, విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించలేదు గాని ఆమెకు అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది ఉద్యోగులు తెలిపారు, ఈ ఘటనపై వివరాలు తెలుసుకునేందుకు ఆసుపత్రి వైద్యులను సంప్రదించగా విద్యార్థిని ఆసుపత్రిలో అడ్మిట్ అయింది వాస్తవమేనని, ఈ కేసు విషయంలో మాకు పోలీసుల నుండి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని, మైనర్ బాలిక కావడంతో ఎవరికి ఈ విషయం వెల్లడించరాదని సూచించారు,

### ›› మైనర్ బాలిక కాబట్టి వివరాలు వెల్లడించలేదు

మైనర్ బాలిక కాబట్టి సమాచారం ఇవ్వలేమని వైద్యులు తెలుపుతున్నారు. విద్యాసంస్థల చైర్మన్ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అటువంటి ఘటన గురించి ప్రస్తుతం పూర్తి సమాచారం లేదన్నారు ,నేను అందుబాటులో లేను పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత చెప్తానని సమాధానం ఇస్తున్నారు, మైనర్ విద్యార్థినికి సంబంధించిన ఘటన కావడంతో ఇది మరింత సున్నిత అంశముగా మారింది, ఘటన వెనుక పరిస్థితులు ఏమిటి? విద్యార్థిని ఎలా ఈ పరిస్థితికి చేరుకుంది? ఆమెకు అవసరమైన కౌన్సిలింగ్ మార్గ నిర్దేశం అందిందా? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి, విద్యాసంస్థల పరిధిలో విద్యార్థుల భద్రత పర్యవేక్షణ, నైతిక బోధన, కౌన్సిలింగ్ వ్యవస్థల బలోపేతం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు, ఈ ఘటన విషయంపై పోలీసులు ఆరా తీసినట్టు తెలిసింది

# ఒత్తిడిని జయిస్తే విజయం

(మొదటి పేజీ తరువాయి...)

గురవుతుంటారు. దీంతో పరీక్షా కేంద్రానికి వెళ్లిన తరువాత చదివిన విషయాలు గుర్తుకు రాకపోవచ్చు. ఇలాంటి సమయంలో ధైర్యంగా, ప్రశాంతంగా ఉండటం అత్యంత ముఖ్యము. ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా చదివి ముందుగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. తరువాత గుర్తుకు రాని ప్రశ్నలపై ఆలోచించి సమాధానాలు రాయాలి. ఆందోళనలో ఉంటే తెలిసిన విషయాలూ మరచిపోయే ప్రమాదం ఉంది.

### ›› సమయపాలన కీలకం

పరీక్ష రాసేటప్పుడు సమయపాలన చాలా అవసరం. నిర్ణీత గడువులో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సమయాన్ని విభజించుకోవాలి. ప్రతి ప్రశ్నకు తగిన సమయం కేటాయించడం అలవాటు చేసుకోవాలి.

### ›› ఆరోగ్యంపై శ్రద్ధ

పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలి,తగినంత నీరు తాగాలి,జంక్ ఆహారానికి దూరంగా ఉండాలి,కనీసం 6–8 గంటలు ప్రశాంత నిద్ర తీసుకోవాలి,రేయింబవళ్లు చదవడం వల్ల అలసట పెరిగి ఏకాగ్రత తగ్గుతుంది. కాబట్టి సమతుల్యమైన నిద్ర అవసరం.

### ›› విజయానికి మూడు మంత్రాలు

ఆత్మవిశ్వాసం,క్రమబద్ధమైన పునఃశ్చరణ,ఆరోగ్య సంరక్షణ పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమే. ధైర్యం, పట్టుదల, సమయపాలన ఉంటే ప్రతి విద్యార్థి విజయాన్ని అందుకోగలడు.

### ›› భయం వీడాలి:హాసవత్ వెంకటేశ్వరావు ,డీఈవో ,భద్రాద్రి జిల్లా



పరీక్షలంటే భయం వదిలేస్తే విజయం సులభం. ప్రశాంతంగా ఉండి ముఖ్యాంశాలను పునఃశ్చరణ చేయాలి. మెలకువలతో చదివిన విషయాలను గుర్తుంచుకునే ప్రయత్నం చేయాలి. ఉత్తమ ఫలితాల కోసం మానసికంగా సన్నద్ధం కావాలి.

### మానసికంగా సిద్ధం కావాలి: డాక్టర్ వై రాజశేఖర్ రెడ్డి , పిల్లల వైద్య నిపుణుడు



విద్యార్థులు పరీక్షలకు మానసికంగా సిద్ధమైతే మంచి ఫలితాలు సాధించగలరు. ఆందోళన,ఒత్తిడికి లోనుకాకూడదు. పరీక్షలకు ముందు ఒక గంట చదివితే అందులో కనీసం పావుగంట పునఃశ్చరణకు కేటాయించడం మంచిది

## దమ్మపేట నూతన ఎంఈఓగా జగపతి బాధ్యతలు స్వీకారం

**దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండల నూతన మండల విద్యా అధికారి (ఎంఈఓ)గా జగపతి బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఆయన నాచారం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేశారు. విద్యా రంగంలో అనుభవం కలిగిన ఆయన నియామకంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జగపతి మాట్లాడుతూ మండలంలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యతను పెంపొందించడం, విద్యార్థుల హాజరు శాతం పెంచడం, మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయడం తన ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమన్వయంతో పని చేస్తేనే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని, ప్రతి పాఠశాలలో అకాడమిక్ ఫలితాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు.



# పెద్దమ్మ తల్లి అమ్మవారికి వైభవంగా పంచామృతాభిషేకం

- అమ్మవారిని దర్శించుకున్న శ్రీలంక సుప్రీంకోర్టు జడ్జి





**పాల్వంచ, ఫిబ్రవరి 27 ,ప్రజా జ్యోతి** పాల్వంచ మండల పరిధిలోని కెపి జగన్నాధపురం గ్రామంలో కొలువుతీరిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రతి శుక్రవారం మాదిరిగా పంచామృతాలతో వైభవంగా ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, హారతి సమర్పించిన అనంతరం అమ్మవారి మూల విరాట్ కు పంచామృతములతో వైభవంగా పంచామృత అభిషేకం నిర్వహించారు, ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు, అదేవిధంగా శ్రీలంక సుప్రీంకోర్టు జడ్జి తురాజ్ రాజాజీ దంపతులు పెద్దమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, జడ్జి ఆలయానికి రావడంతో ఆలయ కార్యనిర్వాణాధికారి, పాలక మండల సభ్యులు, ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు, ఆలయ ఈవో రజనీకుమారి, పాలకమండలి అధ్యక్షులు బాలినేని నాగేశ్వరరావు, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ విద్యార్థులకు ఫినాయిల్ తయారీలో శిక్షణ



**చర్ల, ఫిబ్రవరి 27:(ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రం లోని స్థానిక రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం లో శుక్రవారం రాహుల్ హై స్కూల్ విద్యార్థులకు కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సి ఆర్ పీ ఎఫ్ ) 141 బెటాలియన్ వారి సివిక్ యాక్షన్ ప్రోగ్రాం లో భాగంగా కమాండెంట్ రితీష్ కుమార్ ఠాకూర్ ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ మనీష్ కుమార్ ఆధ్వర్యం లో రాహుల్ విద్యార్థులకు ఫినాయిల్ తయారీ శిక్షణా కార్యక్రమాన్ని కళాభవన్ లో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమం లోఅతి తక్కువ పెట్టుబడితో ఇంట్లోనే ఫినాయిల్ తయారు చేసే విధానాన్ని నిపుణులు ప్రత్యక్షంగా వివరించారు. వైట్ ఫినాయిల్ తయారీకి కావాల్సిన రసాయనాలను,నాణ్యతను పెంచే పద్ధతులు మార్కెటింగ్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సి ఆర్ పీ ఎఫ్ అధికారులు మాట్లాడుతూ సి ఆర్ పీ ఎఫ్ కేవలం భద్రతకే పరిమితం కాకుండా, ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధి కోసం ఇలాంటి సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లను నిరంతరం నిర్వహిస్తుందని తెలిపారు. రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం వారు ఈ శిక్షణ కార్యక్రమానికి సహకారం అందించడం పట్ల ప్రిన్సిపాల్ వర్మరాజు కు ధన్యవాదములు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ పీ ఎఫ్ అధికారులు,శిక్షకులు శంకర రావు ,రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం డైరెక్టర్ కొసరాజు హరిచరణ్,ఉపాధ్యాయులు బిట్రగుంట క్రాంతి కుమార్, ఎస్ కె ఉస్మాన్, శెట్టి సునీత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఇంగ్లీష్ పేపర్–I పరీక్ష నిర్వహణ

- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు

**పాల్వంచ, ఫిబ్రవరి 27 ,ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల భాగంగా శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీష్ పేపర్–I పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మొత్తం 37 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహించబడినట్లు తెలిపారు . జనరల్ విభాగంలో 7,612 మంది, వృత్తి విద్య విభాగంలో 1,872 మంది కలిపి మొత్తం 9,484 మంది విద్యార్థులు ఉండగా, అందులో జనరల్ విభాగంలో 7,365 మంది, వృత్తి విద్య విభాగంలో 1,677 మంది కలిపి మొత్తం 9,042 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు. జనరల్ విభాగంలో 247 మంది, వృత్తి విద్య విభాగంలో 195 మంది కలిపి మొత్తం 442 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వెల్లడించారు.పరీక్షా కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని తెలిపారు. ప్రశ్నాపత్రాల పంపిణీ, పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు.

## క్రీడల్లో యువత జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలి

- రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల



**పాల్వంచ, ఫిబ్రవరి 28,ప్రజాజ్యోతి:** నేటి యువత క్రీడల్లో తమ శక్తి సామార్థ్యాలతో జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావుపేటలో యర్రపోతు పుల్లయ్య మెమోరియల్ కప్, సంతోష్ కుమార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు, లక్ష్మీదేవిపల్లి(కొత్తగూడెం) మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన అనంతరం కొత్వాల మాట్లాడారు, నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు.ప్రస్తుత సమాజంలో చదువు తో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరం అని కొత్వాలఅన్నారు.ఈ కార్యక్రమంలో నారాయణరావు పేట ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు, ఉప సర్పంచ్ యర్రపోతు సంతోష్ కుమార్, నాగారం దంతేలబోర ఎస్సీ కాలనీల సర్పంచ్ లలు స్వప్న, వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు జాలె జానకి రెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, వై. వెంకటేశ్వరరావు ( వై. వి), మెంటెం రాము, పి. పవన్ కళ్యాణ్, లక్ష్మి నారాయణ, నారాయణరావు పేట పంచాయితీ బోర్డు సభ్యులు పి వెంకన్న, అక్షర ,రంజిత్, హుస్సేన్, కిరణ్, వెంకటేశ్వర్లు, ప్రేమ్ చంద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## అన్ని వనరులు ఉన్న పాల్వంచలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎరువులు సిమెంట్ విద్యుత్ కర్మాగారాలను నెలకొల్పాలి

- డిస్టిక్ డెవలప్మెంట్ ఫోరం నిర్వహకులుకొండపల్లి శ్రీధర్



**పాల్వంచ, ఫిబ్రవరి 27,ప్రజా జ్యోతి:** ఉమ్మడి జిల్లాలో ని నిరుద్యోగ యువతీ యు వకులకు ఉపాధి అవకాశాలు రావాలంటే అన్ని వనరులు ఉన్న పాల్వంచ పట్టణం లో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిస్టిక్ డెవలపెమ్మెంట్ ఫోరం నిర్వాహకులు కొండపల్లి శ్రీధర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు, శుక్రవారం పాల్వంచ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ జిల్లాలో గోదావరి,కిన్నెరసాని, తదితర జీవనదులు,సింగరేణి బొగ్గు,కేటీపీఎస్,బిటిపియస్ విద్యుత్తు మరో పక్క ఉన్నత చదువులు చదివిన శ్రమ చేసే కార్మికులు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లా వెనకబడి ఉందని, ప్రధానం గా జిల్లా హెడ్ క్వార్టర్ గావున్న పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలలో వ్యాపారాలు లేక షా పులు బోసిపోతున్నాయని, దీంతో వ్యాపారులు అద్దెలు కట్టుకోలేక, నిరుద్యోగులు ఉపాధి లేక తల్లడిల్లుతున్నారని, ఇట్టి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ఎన్ ఎం డి సి, ఏపీ స్టీల్ లాంటి మూతపడిన పరిశ్రమలను తెరిపించనైనా తెరిపించాలని లేదా అన్ని వనరుల పుష్కలంగా ఉన్న జంట నగరాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూని ట్లు, ఎరువుల ఫ్యాక్టరీ, సిమెంట్ ఫ్యాక్టరీ, థర్మల్ పవర్ ప్లాంట్, వ్యవసాయఆదరిత మిర్చి, పత్తి పుష్కలంగా ఉన్న జిల్లాలో వస్త్ర పరిశ్రమ లు ఏర్పాటు చేస్తే వేలాది మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కలుగుతాయి అన్నారు, కార్పొరేషన్ ఏర్పడినందున అత్యధిక డివిజన్లో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి నిధులు కేటాయించి అవి అభివృద్ధిపదంలోకి తీసుకురావాలని, విపరీతమైన ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు , జిల్లా అభివృద్ధికి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రైతులు పండించే పత్తి, మిర్చి, ధాన్యం తదితర పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలనివీటి సాధనకై భవిష్యత్తులో అన్ని వర్గాల ప్రజానీకాన్ని కలుపుకొని ఉద్యమాలు నిర్వహించి జిల్లా సమగ్ర అభివృద్ధికి పూనుకుంటానని అన్నారు.ప్రెస్ మీట్ అనంతరం ఆయన కొ న్ని అంతర్గత కారణాలు, అనివార్య పరిస్థితులలో సిపిఎం పార్టీ సభ్యత్వానికి పార్టీ జిల్లా కమిటీకి రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

## నిత్యన్నదాన సత్రంను తనిఖీ చేసిన దేవస్థానం ఈవో



**భద్రాచలం, ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం నిత్యన్నదానసత్రంను శుక్రవారం భద్రాచలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తనిఖీ చేశారు. సమయంలో భక్తులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకోవడంతో పాటు పలువురు భక్తులతో మాట్లాడి అన్నదానంకు సంబంధించి తగిన సూచనలు, సలహాలు స్వీకరించారు. అలాగే అన్నదానం స్టోర్ రూము, కిచెన్‌ను పరిశీలించడంతో పాటు సిబ్బంది వివరాలను పరిశీలించారు. అదేవిధంగా రాబోయే శ్రీరామనవమి కాబట్టి భక్తులకు అందించే సేవల్లో ఎటువంటి లోటుపాట్లు రాకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, అన్నదానంకు సంబంధించిన అన్ని రకాల సరుకులు ఎప్పటికప్పుడు సిద్దంగా ఉంచాలని భక్తులు అధిక సంఖ్యలో ఉన్నవచ్చిన సమయంలో అప్పటికప్పుడు అన్నదానం సిద్దం చేసేలా ఉండాలని సూచించారు. ఈవో వెంట దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

## అమలాపురంలో భద్రాద్రి రామయ్య కల్యాణం

- స్వర్ణభద్ర కవచాలతో భద్రాద్రి రామయ్య దర్శనం



**భద్రాచలం, ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఏపీలోని బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో శుక్రవారం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భద్రాచలం నుంచి ప్రత్యేక రథంలో తీసుకెళ్లిన స్వామి వారి ఉత్సవమూర్తులను అందంగా అలంకరించిన మడపంపై ఆసీనులను చేశారు. అనంతరం తొలుత విశ్వక్సేనార్చన నిర్వహించి కల్యాణ క్రతువను భద్రాచలం నుంచి వెళ్లిన వైదిక బృందం ప్రారంభించారు. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారన, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను నిర్వహించారు. అనంతరం కల్యాణంకు అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అలాగే స్వామి వారి లడ్డూ ప్రసాదం స్వీకరించడంతో పాటు భక్తులకు నిత్యన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా శుక్రవారం సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారు స్వర్ణ భద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు.



## మార్చి 6న భద్రాచలంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

- గిరిజన భవనంలో భోగ్ బండారో కార్యక్రమం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు



**భద్రాచలం,ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను మార్చి 6న ఘనంగా నిర్వహించనున్నట్లు భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు తెలిపారు.భద్రాచలం గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాంగణంలోని గిరిజన భవనంలో శుక్రవారం భోగ్ బండారో కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా శాసనసభ్యుల కార్యాలయంలో లంబాడీ జేఏసీ నాయకులతో సమావేశం నిర్వహించారు.అనివార్య కారణాల వల్ల ఫిబ్రవరి 28న నిర్వహించవలసిన జయంతి ఉత్సవాలను మార్చి 6కు మార్చినట్లు తెలిపారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గంలోని లంబాడీ గిరిజనులు, సోదర సోదరీమణులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కుల పెద్దలు, యువతీ యువకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శాసనసభ్యులు పిలుపునిచ్చారు.సమావేశంలో డి. హరిచంద్ర నాయక్, లకావత్ వెంకటేశ్వర్లు, భూక్యా రంగా, బి. బన్సీలాల్, బి. గోవింద్, బి. మదర్ నాయక్, టి. బాలు నాయక్, టి. మోహన్ లాల్, బి. తారాచంద్, బి. కిషన్, బి. గోపాల్ కృష్ణ, డి. సైదులు, జె. ఈశ్వర్, జి. రాందాస్, భూక్యా సాయి కౌశిక్, బి. బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ పోటీలు

- గౌరవ అతిథులకు హాజరైన తాసిల్దార్ గోపాలకృష్ణ ఎఫ్ఆర్ఓ తేజస్వి



**పినపాక,ఫిబ్రవరి 27(ప్రజాజ్యోతి):**పినపాక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా ఎల్చి రెడ్డిపల్లి క్రికెట్ మైదానంలో జరుగుతున్న జర్నలిస్ట్ కప్ క్రికెట్ పోటీలు మూడో రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. మైదానంలో క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. మూడవ రోజు జరిగిన పోలీస్ వర్సెస్ బిటిపిఎస్ ఏఈ మ్యాచ్ లో ప్రతి బంతి ఉత్కంఠతను రేకెత్తించింది. ఇరు జట్ల మధ్య విజయం దోబూచులాడి చివరకు పోలీస్ జట్టును వరించింది. పోలీస్ జట్టు ఒక్క పరుగుతో విజయం సాధించింది. అనంతరం రెండో మ్యాచ్ లో ఫారెస్ట్ వర్సెస్ రెవిన్యూ జట్టు మధ్య జరిగిన మ్యాచ్ వారాహోరీగా సాగింది. ఈ మ్యాచ్లో ఫారెస్ట్ జట్టు విజయం సాధించింది. మూడో రోజు క్రికెట్ పోటీలకు గౌరవ అతిథులుగా పినపాక తాసిల్దార్ గొంది గోపాలకృష్ణ, ఎఫ్ఆర్ఓ తేజస్వి హాజరై మ్యాచ్లను తిలకించారు. క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధుల, జర్నలిస్టులతో కలిసి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఉద్యోగరీత్యా నిత్యం బిజీగా ఉండే తమకు ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తీసుకు వచ్చిందని అన్నారు. తమ స్నేహితులతో చదువుకున్న రోజుల్లో ఆడిన ఆటలు గుర్తుకు వచ్చాయని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలలో పాల్గొనడం వలన అధికారులు ఒకరికొకరు పరిచయాలు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కీసర్ సుధాకర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు బూరా శంకర్, బిల్లా నాగేందర్, ముక్కు మహేష్ రెడ్డి, కొంపెల్లి సంతోష్, దిలీప్ వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

# సింగరేణిలో అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రమాణాలు

- సంస్థలోని ఉద్యోగులకు పిఎంఈ పరీక్షలను నిర్వహించాలి






**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 27 – ప్రజాజ్యోతి:**
డిజిఎంఎస్(డైరక్టరేట్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ) వారి సహకారముతో రెండవ జోనల్ వర్క్ షాప్ లో భాగముగా ఓ హెచ్ఎస్ డాక్టర్లకు అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రమాణాలను అనుసరించి కోల్ అనుబంధ సంస్థలలోని బొగ్గు గనులలో పని చేసే ఉద్యోగులకు కోల్ వర్కర్ నిమోకోనియోసిస్ నిర్ధారణ కోసం జరిపే చెస్ట్ రేడియోగ్రాఫ్ క్లాసిఫికేషన్ పై 2 రోజుల పాటు కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ గారి అధ్యక్షతన డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ డాక్టర్ కౌశిక్ సర్కార్ వారిచే నిర్వహించిన వర్క్ షాప్ ముగింపు కార్యక్రమానికి డైరక్టర్(పి&పి) కే.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భముగా డైరక్టర్(పి&పి) కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఈ రెండు రోజులపాటు రెండవ జోనల్ వర్క్ షాప్ కార్యక్రమం లో చర్చించిన అంశాలను అనుసరించి అంతర్జాతీయ కార్మిక సంస్థ ప్రమాణాలను లోబడి మైనింగ్ ఇండస్ట్రీలలో పనిచేసే ఉద్యోగుల ఆరోగ్య భద్రత కొరకు సమయానుకులముగా ఉద్యోగులందరికి పిఎంఈ ఆరోగ్య పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. అదే విధముగా ఉద్యోగులందరికి గనులలోని పని ప్రదేశాలలో తీసుకొనవలసిన ఆరోగ్య రక్షణ కొరకు తీసుకొనవలసిన చర్యల గురించి వివరించాలని తద్వారా ఉద్యోగులు రోగాలబారిన పడకుండా ఉంటారని, సహజ మరణాల సంఖ్యను కూడా తగ్గించవచ్చని తెలిపారు. అనంతరం ఈ శిక్షణా కార్యక్రమం లో పాల్గొన్న డాక్టర్లకు సర్టిఫికెట్ల ప్రధానం చేసి, రెండు రోజులపాటు రెండవ జోనల్ వర్క్ షాప్ లో పరిశ్రమలలో వృత్తి ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయడం కొరకు డాక్టర్లకు విలువైన సూచనలు చేసిన డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ డాక్టర్ కౌశిక్ సర్కార్ ని అభినంధించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ (పి&పి) కే.వెంకటేశ్వర్లు, డిజిఎంఎస్ అడ్వైసర్ & రిటైర్డ్ డిఎంఎస్ కౌశిక్ సర్కార్ గార్లతో పాటు సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, జిఎం(సేఫ్టీ) కే.సాయిబాబు, జిఎం(సేఫ్టీ) కేజిఎం రీజియన్ కృష్ణ గోపాల్ తివారీ, ఏసిఎంఓ ఎం.ఉష, ఓ హెచ్ఎస్ డా. పి. రమేష్ బాబు, సింగరేణి వ్యాప్తముగా గల సింగరేణి ఏరియా ఆసుపత్రుల మరియు డిస్పెంసరిల హెచ్ఓడి డాక్టర్లు, వెస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్, ఈఎస్ఐసి, ఇతర సంస్థల నుండి వచ్చిన వైద్యులతో కలిపి మొత్తం 50 మంది డాక్టర్లు ఈ వర్క్షాప్లో పాల్గొన్నారు.

## భద్రాచలంలో అక్రమ ఇసుక నిల్వలపై రెవెన్యూ శాఖ కఠిన చర్యలు

- శాంతినగర్ ప్రాంతంలో ఇసుక డంపు స్వాధీనం



**భద్రాచలం,ఫిబ్రవరి 27,ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ పరిధిలో అక్రమ ఇసుక నిల్వలు, రవాణాపై రెవెన్యూ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. భద్రాచలం–కూనవరం రహదారిలోని శాంతినగర్ ప్రాంతంలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.భద్రాచలం తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు జీపీఓ భాస్కరరావు, ఆర్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు రెండు నుంచి మూడు లారీల మేర అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను గుర్తించారు. సంబంధిత స్థలంలో పంచనామా నిర్వహించి ఇసుక డంపును స్వాధీనం చేసుకున్నారు.గోదావరి నది పరివాహక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకం, నిల్వ, రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వ్యక్తులపై నిరోధక చట్టాల కింద కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.భద్రాచలం పరిధిలో ఎక్కడైనా అక్రమ ఇసుక తవ్వకం లేదా రవాణా జరుగుతున్నట్లు గమనించిన ప్రజలు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని రెవెన్యూ శాఖ విజ్ఞప్తి చేసింది.అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు తనిఖీలు మరింత ముమ్మరం చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు

## కొత్తగూడెం కార్పొరేషన్‌కు 'పాల్వంచ' పేరు చేర్చాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసిన ఎమ్మెల్యే కూనంనేని
- పాల్వంచ పాత వైభవం, ప్రజ ఆకాంక్షల మేరకే ఈ డిమాండ్
- కొత్తగూడెం - పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా నామకరణం చేయాలి
- అసెంబ్లీలో తీర్మానం చేసి పేరు మార్చాలని సీఎంకు విన్నపం
- కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు



**పాల్వంచ ,ఫిబ్రవరి 27,ప్రజా జ్యోతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరును కొత్తగూడెం , పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా మార్చాలని కోరుతూ కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఇటీవల కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను విలీనం చేసి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ నూతన కార్పొరేషన్‌కు కేవలం కొత్తగూడెం పేరు మాత్రమే ఉందని, పాల్వంచ పేరు చేర్చాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారని, వారి మనోభావాలను గౌరవిస్తూ పేరు మార్చాలని ఎమ్మెల్యే కోరారు. పాల్వంచకు ఘనమైన చరిత్ర ఉందని, గతంలో ఇది ఒక సంస్థానంగా, ప్రత్యేక అసెంబ్లీ నియోజకవర్గంగా విరాజిల్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అటువంటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాల్వంచ పేరును కార్పొరేషన్‌లో చేర్చడం ద్వారా ఆ ప్రాంత గౌరవాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడినట్లవుతుందని కూనంనేని పేర్కొన్నారు. కార్పొరేషన్ పేరు మార్పు విషయంలో పాల్వంచ ప్రజల కోరిక అత్యంత సమంజసమని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరితగతిన 'కొత్తగూడెం–పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్'గా అధికారిక ప్రకటన వెలువడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతూ పంపిన లేఖలో ఆయన వివరించారు.

## ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ

**ఇల్లందు, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి:**మండలంలోని ఇందిరానగర్ గ్రామపంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటికి శుక్రవారం సర్పంచ్ పాయం లలిత, మాజీ వైస్ యంపిపి మండల రాము భూమి పూజ చేశారు. ఇందిరమ్మ ఇంటిని పూర్తి నాణ్యతతో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బెల్లంకొండ ఆదిత్య, వార్డు సభ్యులు ఊకె చుక్కమ్మ, బురక రాకేష్, బిఎన్ సుదర్శన్, ప్రజలు పాల్గొన్నారు.





# కొత్త వేతన సవరణ అడ్డుకోవడానికే విద్యా కమిషన్ నివేదిక

- **టిజిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ఆగ్రహం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :** కొత్త వేతన సవరణ ప్రకటించకుండా అడ్డుకోవడానికే విద్యా కమిషన్ నివేదిక ఉద్దేశపూర్వకంగా రూపొందించినట్లు తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ఆరోపించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన విద్యా కమిషన్ నివేదిక ఉపాధ్యాయులను అవమానించే విధంగా ఉందని మండిపడ్డారు.విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి సమర్పించిన నివేదికలో వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వ ఉపాధ్యాయుల వేతనాలు, అర్హతలపై అశాస్త్రీయ వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలు, అనుభవజ్ఞుల సూచనలు తీసుకోకుండా నివేదిక ఇవ్వడం సరైన విధానం కాదన్నారు.రాష్ట్రంలో ఇప్పటికే ఉపాధ్యాయులకు స్పష్టమైన సేవా నియమాలు లేకపోవడం, మండల జిల్లా స్థాయి పర్యవేక్షణ పోస్టులు ఖాళీగా ఉండి ఇంచార్జి విధానంతో నడుస్తుండటం ఆందోళనకరమన్నారు. అనేక మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర శాఖల్లో పనిచేస్తుండగా, ప్యానెల్ తనిఖీల పేరుతో జిల్లాల నుంచి ఉపాధ్యాయులను తరలించడం వల్ల పాఠశాలల్లో బోధన దెబ్బతింటోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1700 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌లో ఉన్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గుదలకు ఉపాధ్యాయులే కారణమన్న అభిప్రాయం తప్పుదోవ పట్టించేదని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న ఆవాసాలు, తక్కువ జనాభా, ఒకటి లేదా రెండు పిల్లల కుటుంబాల పెరుగుదల వంటి కారణాలతో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని తెలిపారు. ప్రస్తుతం అనేక ప్రాథమిక పాఠశాలలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులే ఐదు తరగతులకు బోధిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 18 విషయాలు ఎలా బోధించగలరని ప్రశ్నించారు.కార్పొరేట్ విద్యా వ్యవస్థ పెరుగుదలతో తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు వచ్చిందన్నారు. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలకు తగిన వసతులు, పాఠ్యపుస్తకాలు, శిక్షణా విధానాలపై దృష్టి పెట్టాల్సిందిగా సూచించారు. వేతనాలపై మాత్రమే నివేదిక ఇవ్వడం సముచితం కాదన్నారు.ప్రస్తుత ధరల పెరుగుదల దృష్ట్యా ఉద్యోగుల జీవన ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, నెలాఖరులో వేతన జీవులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పారు. హాజరు నమోదు విధానం వల్ల ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగిందని, అయితే వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు వంటి అంశాల్లో కొంత వెసులుబాటు అవసరమని అభిప్రాయపడ్డారు.గతంలో ఏర్పాటైన గురుకులాలు, ప్రత్యేక పాఠశాలల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిందని తెలిపారు.కొత్తగా ప్రారంభిస్తున్న ప్రత్యేక పాఠశాలల వల్ల కూడా మండల జిల్లా పరిషత్ పాఠశాలలపై ప్రభావం పడుతోందన్నారు. పేద విద్యార్థుల కోసం పాఠశాలలు ప్రారంభించడం మంచి ఉద్దేశమే అయినా, ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన ఉపాధ్యాయుల సమాఖ్య రాష్ట్ర శాఖ తరపున పలు డిమాండ్లు చేశారు. 45 శాతం ఫిట్మెంట్‌తో వెంటనే వేతన సవరణ ప్రకటించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా అదనపు పోస్టులు మంజూరు చేయాలి. పెండింగ్ భత్యాలు, వైద్య మరియు విరమణ ప్రయోజనాలు వెంటనే చెల్లించాలి. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న పండిట్, శారీరక విద్య ఉపాధ్యాయుల పోస్టులను ఉన్నతీకరించి పదోన్నతులు కల్పించాలి. కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. 2008 డీఎస్సీకి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష మినహాయింపు ఇవ్వాలి. ప్యానెల్ తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలల నుంచి దూరం చేయవద్దని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయ పోస్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

## ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్,ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి ):** మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన ధ్వజస్తంభ పునఃప్రతిష్ట, బలిపీఠ ప్రతిష్ఠ మరియు లక్ష్మీ గణపతి, బాలత్రిపుర సుందరి దేవతల ప్రతిష్ఠ మహోత్సవంలో శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ సర్వేశ్వరుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ మందా నాగరాజు,ఉప సర్పంచ్ గుండె వెంకన్న, టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్, భజన ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వార్డు సభ్యుల శిక్షణ తరగతులు



**బూర్గంపహాడ్,ఫిబ్రవరి 27(ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో ఫిబ్రవరి 23వ తేదీన ప్రారంభమైన రెండో విడత వార్డు సభ్యుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. మండలంలోని అంజనాపురం, కృష్ణసాగర్, లక్ష్మీపురం, మోతెపట్టినగర్, ముసలమడుగు, నకిరిపేట, పినపాక పట్టినగర్, టేకులచెరువు, ఉప్పుసాక, వేపలగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 90 మంది వార్డు సభ్యులకు విధులు, బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో జమలారెడ్డి తెలిపారు. అనంతరం వార్డు సభ్యులకు శిక్షణ పత్రాలను కూడా అందించారు. శిక్షణ తీసుకున్న వార్డు సభ్యులు ఎంపీడీవోను సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీవోటీలు ఎస్ కృష్ణ చైతన్య, బి వెంకటేష్, కే శ్రీనివాసరావు, సిహెచ్ కిరణ్ కుమార్, గ్రామ పంచాయితీల కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్స్, తదితరులు పాల్గొన్నారు.

## చెత్తకు నిప్పు ...బడ్డి కొట్టు దగ్ధం

**పాల్వంచ ఫిబ్రవరి 27 ప్రజా జ్యోతి:** పాల్వంచ పట్టణంలోని నెహ్రూ నగర్ లో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక బడ్డీ కొట్టు దగ్ధమైంది, ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల తెలిపిన ప్రకారం ఈ విధంగా ఉన్నాయి, బడ్డీ కొట్టు పక్కనే గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెట్టారు, ఆ మంటలు కాస్త పక్కనే ఉన్న బండి కొట్టుకు వ్యాపించడంతో బడ్డీ కొట్టు పూర్తిగా దగ్ధమైంది, స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసే లోగానే బడ్డీ కొట్టు పూర్తిగా దగ్ధం కావడంతో షాపు యజమాని లబో దిబో మన్నాడు.

## ఖమ్మం వెలుగుమట్లలో గుడిసెల కూల్చివేతపై సిపిఎం తీవ్ర ఖండన

- **అర్హులైన పేదలకు అదే స్థలంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించాలి : సిపిఎం డిమాండ్**




**దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి):** శుక్రవారం దమ్మపేట సిపిఎం పార్టీ ఆఫీస్ సుందరయ్య భవన్‌లో మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు ఖమ్మం పట్టణంలోని వెలుగుమట్ల ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల గుడిసెలను కూల్చివేసిన చర్యను తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా అయన మాటాడుతూ గత పది సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్న పేదలకు ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, మూడు జిల్లాల పోలీసులను మోహరించి యుద్ధ వాతావరణంలో గుడిసెలను తొలగించడం అమానుషం, దుర్మార్గమని నాయకులు విమర్శించారు. ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు.భూదాన్ భూములుగా పేర్కొనబడుతున్న ఈ స్థలాలను అర్హులైన పేదలకు కేటాయించడంలో ప్రభుత్వం ఎందుకు వెనుకడుగు వేస్తోందని ప్రశ్నించారు. గతంలో కొంతమంది దళారులు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని అమాయకుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్న నేపథ్యంలో, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కూల్చివేసిన అదే ప్రదేశంలో అర్హులైన పేదలకు తక్షణమే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం పార్టీ స్పష్టం చేసింది. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించింది.ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు కొలికపోగు శ్రీనివాసరావు, చెన్నుబోయిన బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ పొందుతున్న జిఎంకు ఆత్మీయ సన్మానం



**కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 27 – ప్రజాజ్యోతి:** ఈ నెల 28 వ తేదీన పదవీ విరమణ పొందుతున్న సందర్భముగా సింగరేణి సంస్థ జనరల్ మేనేజర్ (ఎక్స్ప్లోరేషన్) బి.శ్రీనివాస రావు ను శుక్రవారము నాడు సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు ఐ&పిఎం డిపార్ట్మెంట్ ఆధ్వర్యం లో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమం లో డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పి&పి) కే.వెంకటేశ్వర్లు కలిసి జనరల్ మేనేజర్ (ఎక్స్ప్లోరేషన్) బి.శ్రీనివాస రావు కి పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరక్టర్(పి&పి) శ్రీ కే.వెంకటేశ్వర్లు, వివిధ డిపార్ట్మెంట్ల జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ... సుమారు 37 సంవత్సరాల సుధీర్ఘ సర్వీసులో బి.శ్రీనివాస రావు సింగరేణి సంస్థ లో పలు పదవుల్లో వారు క్రమ శిక్షణ తో, అంకిత భావముతో విధులు నిర్వహించి స్నేహపూర్వకంగా అందరి మన్ననలు పొందారని, మైనింగ్ విభాగం లో ముఖ్యముగా ఎక్స్ప్లోరేషన్ విభాగం లో తనదైన శైలిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని, సింగరేణి సంస్థలో క్రిటికల్ మినరల్స్ ఎక్స్ప్లోరేషన్ కొరకు కృషి చేశారని తెలుపుతూ వారు చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. పదవీ విరమణ అనంతరం వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమములో జిఎం(సిపిపి) ఏ.మనోహర్, జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జిఎం(ఎంఎస్) బొజ్జ రవి, జిఎం(సిహెచ్‌పి) పి.ఎలిషా, జిఎం(ఐ&పిఎం) సిహెచ్.శ్రీహరి, జిఎం(ట్రాన్స్పోర్ట్) ఎం.రామనాథం, జిఎం(ఈ&ఎం) పి.మురళీ కృష్ణ, జిఎం(స్టోర్స్) కే.ప్రసాద రావు, జిఎం(ఈ&ఎం) ఎస్.వి.రామ మూర్తి, జిఎం(పి&పి) జి.దేవేందర్, జిఎం(సోలార్) బి.సీతారామం, హెచ్ఓడి(విజిలెన్స్) పి.రాజీవ్ కుమార్, ఇతర జిఎం లు, అధికారులు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయాలని వినతి



**ఇల్లందు, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి:** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు 24 ఏరియాలో గల మున్సిపల్ వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయాలని శుక్రవారం 22వ వార్డు కౌన్సిలర్ కోర్లపాటి శివకిరణ్ మున్సిపల్ డిఈ కి వినతి పత్రం అందజేశారు. వాటర్ ట్యాంక్ నుంచి నీరు కారడం వల్ల ప్రక్కన నివసించే వారి ఇల్లు కూలే ప్రమాదం లేకపోలేదని వివరించారు. త్వరితగతిన వాటర్ ట్యాంక్ మరమ్మత్తులు చేయించాలని కోరారు.

## ఎమ్మెల్యే జారె చేతుల మీదుగా నేడు కళ్యాణ లక్ష్మి–షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి )::** మండల పరిధిలోని గండుగుల పల్లి గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఉదయం 8:00 గంటలకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దమ్మపేట తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు.
నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ చేతుల మీదుగా ఈ చెక్కులు లబ్ధిదారులకు అందజేయబడనున్నాయి. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 88 మంది అర్హులైన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంజూరైన ఈ సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, సంబంధిత లబ్ధిదారులందరూ నిర్ణీత సమయానికి ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయానికి హాజరుకావాలని దమ్మపేట తహసీల్దార్ రామ్ నరేష్‌కోరారు.

## రంజాన్ వేళ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



**ఆళ్ళపల్లి. ఫిబ్రవరి. 27. ప్రజాజ్యోతి** కులాలు, మతాల కంటే మానవత్వమే మిన్న అని నిరూపించారు కేక్కర్ల సునీత మరియు వారి కుటుంబ సభ్యులు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని, ముస్లిం సోదరుల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుతూ వారు ఏర్పాటు చేసిన విందు. ప్రస్తుతం ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం జరుగుతున్న నేపథ్యంలో,ఆళ్ళపల్లి మండల మర్కోడు గ్రామ కేక్కర్ల సునీత వారి కుమారుడు సాయి ప్రత్యేక చొరవతో. మత సామరస్యాన్ని చాటుతూ. ముస్లిం సోదరుల కోసం ప్రత్యేకంగా (ఇఫ్తార్) విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులతో పాటు, వారి కుల పెద్దలు పాల్గొన్నారు ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం మాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అని సునీత వారి కుమారుడు సాయి ఈ సందర్భంగా పేర్కొన్నా.ఈ కార్యక్రమంలో బూర్ణ.రవి. రహీమ్. హైమద్.రై హేమత్.నైమద్ కుద్రత్. అంజాథ్. దౌలత్. అజ్జుల్.కరీముల్లా పాల్గొన్నారు.

## ప్రతిరోజూ పాఠశాలకు హాజరు కావాలి – సర్పంచ్ కుంజా వినోద్




**ములకలపల్లి, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి:** విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ కుంజా వినోద్ పిలుపునిచ్చారు. జగన్నాధపురం కాంప్లెక్స్ పరిధిలో నిర్వహించిన బాలమేళా 2.0 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు భావి భారత ఉత్తమ పౌరులుగా ఎదగగలరని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే బాలమేళా కార్యక్రమం లక్ష్యమని జగన్నాధపురం కాంప్లెక్స్ హెచ్ఎం వెంకట్ నర్సమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎం శంకర్, ఎస్ఆర్‌పి, సీఆర్‌పి, డీఆర్‌పి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాంప్లెక్స్ స్థాయిలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు

# అడ్డగోలుగా... అక్రమ రవాణా

- ఇసుక దందాపై ఉదాసినత
- మండలంలో అధికారులు ఉన్నారా...?
- అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారా....?
- సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తున్న యువత.



**ములకలపల్లి, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి :** మండలంలోని కంపగూడెం క్రాస్ రోడ్ దగ్గరలోని ఎర్రమ్మ గుడి ప్రాంతంలోని పాములేరు వాగు నుంచి లారీల ద్వారా ఇసుకను చండ్రుగొండ మండలానికి అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం రాత్రి ఈ అక్రమ రవాణాను అడ్డుకోవాలని యువత సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. "మండలంలో అధికారులు ఉన్నారా? లేక అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారా?" అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో చర్చలు సాగాయి. యువత హడావుడి చేయడంతో ఒక లారీలో లోడ్ చేసిన ఇసుకతో అక్రమార్కులు అక్కడి నుంచి జారుకున్నట్లు సమాచారం. సంబంధిత సోషల్ మీడియా గ్రూపుల్లో స్థానిక పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన మండల వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. లారీల ద్వారా ఇసుకను బయట ప్రాంతాలకు తరలించడంతో స్థానికంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహాలకు ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయటకు అక్రమంగా తరలింపులపై అధికారులు మౌనం వహిస్తుండగా, స్థానిక అవసరాలకు ఇసుక తరలించినప్పుడు మాత్రం వెంటనే చర్యలు తీసుకుంటున్నారంటూ ద్వంద్వ వైఖరిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మండలంలో కొనసాగుతున్న ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టి సహజ సంపదను పరిరక్షించాలని స్థానిక ప్రజలు అధికారులను కోరుతున్నారు. అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి నష్టం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కఠిన చర్యలు తీసుకుని వాగులు, చెరువులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్ బండి భాగ్యలక్ష్మి ని చరవాణి లో సంప్రదించడానికి ప్రత్నించగా అందుబాటులోకి రాలేదు.

## మంత్రి తుమ్మలపై అనుచిత వ్యాఖ్యలు

- – యూట్యూబర్ రఘుపై పోలీసులకు ఫిర్యాదు




**దమ్మపేట, ఫిబ్రవరి 27 (ప్రజాజ్యోతి ):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబ్ ఛానల్ "తొలి వెలుగు"కు చెందిన రఘు పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ దమ్మపేట మండల కాంగ్రెస్ నాయకులు ఈరోజు దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంత్రి తుమ్మల గత 40 సంవత్సరాలుగా రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రజానాయకుడని, ఆయన ప్రజా సేవా జీవితం తెరిచిన పుస్తకమని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న నాయకుడిపై అసత్య మరియు అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ మేరకు సంబంధిత యూట్యూబర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ దమ్మపేట ఎస్ఐకి కాంగ్రెస్ నాయకులు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ స్వయం ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, అడపా రాంబాబు, కాసాని నాగప్రసాద్, ఎండి వలీ పాషా, యర్ర వసంతరావు, ప్రభాకర్ తదితరులు మరియు అధిక సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, తుమ్మల అభిమానులు పాల్గొన్నారు.

## పిఓ, ఎస్పి ని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్



**ఇల్లందు, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి:** ఐటిడిఎ పిఓ రాహుల్, జిల్లా ఎస్పి రోహిత్ రాజు లను శుక్రవారం ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు మర్యాదపూర్వకంగా కలిసి నేడు సింగరేణి స్కూల్ గ్రౌండ్ లో జరగనున్న సంత్ సేవాలాల్ జయంతి ముగింపు వేడుకలకు అతిధులుగా హజరు కావాలని ఆహ్వానం అందజేశారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ లు హజరవుతున్నట్లు వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో రెపల్లెవాడ సర్పంచ్ బానోత్ శారద, సుదిమళ్ళ మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, టౌన్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గాలిపల్లి స్వరూప, నాయకులు బానోత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తోటల పెంపకంలో జాగ్రత్తలు పాటించండి

- పొగాకు తోటలను పరిశీలించిన ఎన్ఎల్ఎస్ రీవిజనల్ మేనేజర్ సురేందర్ కుమార్, సి టి ఆర్ ఐ శాస్త్రవేత్తలు





**అశ్వారావుపేట, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :** పొగాకు తోటల పెంపకంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, సేంద్రియ పద్ధతుల్లో తోటలను పెంచుకొని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని రీవిజనల్ మేనేజర్ సురేంద్ర కుమార్ అన్నారు. ఫీల్డ్ ఫ్రెండ్లీ టూర్ లో భాగంగా శుక్రవారం సిటిఆర్ఐ శాస్త్రవేత్తలు, టుబాకో బోర్డ్ అధికారులు, వివిధ కంపెనీల ప్రతినిధులతో కలిసి మండలంలోని పలు గ్రామాలలో పొగాకు తోటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొగాకు పంట వేసిన ప్రతి రైతు నాణ్యమైన దిగుబడి కోసం ఉత్తమమైన పద్ధతులను పాటించాలన్నారు. ప్రతి రైతుకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు తాము ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. పలు తోటలు పరిశీలించిన వారు రైతులకు సూచనలు సలహాలు అందించారు.

### ››› సురేంద్ర కుమార్ ను సన్మానించిన రైతు సంఘం నాయకులు

ఎంఎల్ఎస్ ప్రాంత రీజినల్ మేనేజర్ గా నూతనంగా నియామకం ఉంది బాధ్యతలు చేపట్టిన సురేంద్ర కుమార్ ను జంగారెడ్డిగూడెం 32 ఆప్షన్స్ సూపర్డెంట్ గా నూతనంగా వీధుల్లో చేరిన మార్కరేట్ గ్రేస్ ను ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు పలువు రైతులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిటిఆర్ఐ జీలుగుమిల్లి ఇన్చార్జ్ వై.సుబ్బయ్య, ఐటిసి,జిపిఐ, పిఎస్ఎస్ కంపెనీల అభివృద్ధి అధికారులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

# అన్నపురెడ్డిపల్లిలో భక్తి సందడి... బాలాజీ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- .ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 5 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా
- .మార్చి 2 సోమవారం రాత్రి స్వామివారి కళ్యాణ మహోత్సవం ప్రత్యేక ఆకర్షణ





**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ శనివారం నుండి మార్చి 5వ తేదీ గురువారం వరకు వైభవంగా నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణం విద్యుద్దీపాలతో ప్రకాశిస్తూ, పుష్పాలంకరణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మార్చి 2వ తేదీ సోమవారం రాత్రి 10 గంటల నుండి స్వామివారి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించబడుతుంది. అదే రోజు స్వామివారి కళ్యాణాన్ని దర్శించేందుకు వచ్చిన భక్తులందరికీ అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. వేలాది మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లి, కొత్తగూడెం, తిరువూరు ప్రాంతాల నుండి ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు ఆయా డిపో మేనేజర్లు తెలిపారు. భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయానికి చేరుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మార్చి 3న ఉంజల్ సేవ, పల్లకి సేవలు, మార్చి 4న గరుడ వాహన సేవ, మార్చి 5న చక్రస్నానం మరియు పూర్ణాహుతి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ ఐదు రోజుల పాటు ప్రతి సాయంత్రం 7 గంటల నుండి 10 గంటల వరకు ప్రత్యేక భక్తి గీతాల కార్యక్రమాలు నిర్వహించేందుకు దేవస్థానం కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తులు ఆధ్యాత్మిక గానాల మధ్య దివ్యానుభూతిని పొందేలా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. దేవస్థానం ప్రాంగణంలో రంగులరాట్నాలు, బొమ్మల కొట్లు ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలతో మొత్తం ఆలయాన్ని అలంకరించారు. రాత్రివేళల్లో ఆలయం అందంగా మెరవడంతో భక్తులకు విశేష ఆకర్షణగా నిలుస్తోంది. స్వామివారి కళ్యాణ మహోత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు సమన్వయంతో సేవలందిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి వసతులు వంటి అన్ని ఏర్పాట్లు ప్రత్యేకంగా సిద్ధం చేశారు. స్వామివారి ఆలయంలో అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రత్యేకంగా ప్రతిష్ఠించబడినది. అలాగే గుడి నిర్మాణానికి సంబంధించిన కాకతీయుల నాటి స్తూపం ఇప్పటికీ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా భక్తులకు కనబడుతోంది. విశాలమైన ప్రాంగణం, పురాతన శిల్పకళా



చిహ్నాలు ఈ దేవస్థానానికి మరింత వైభవాన్ని చేకూరుస్తున్నాయి. అన్నపురెడ్డిపల్లి దేవస్థానంలో ప్రముఖ కీర్తనాచార్యుడు అన్నమయ్య విగ్రహం ఏర్పాటు చేయబడినది. భక్తులు స్వామివారి దర్శనంతో పాటు అన్నమయ్య విగ్రహాన్ని దర్శించుకుని ఆధ్యాత్మిక భావాలను ఆస్వాదిస్తున్నారు. ఈ ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడతాయని ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ తెలిపారు. గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# గ్రామాభివృద్ధికి వార్డు సభ్యులే కీలకం: ఎంపీడీఓ మహాలక్ష్మి



- అన్నపురెడ్డిపల్లిలో వార్డు సభ్యుల శిక్షణ ముగింపు సభ
- నిధుల వినియోగం, ప్రజా సమస్యల పరిష్కారంపై మార్గనిర్దేశం

**అన్నపురెడ్డిపల్లి, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో గత ఐదు రోజులుగా నిర్వహించిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శిక్షణ ముగింపు సభకు ఎంపీడీఓ మహాలక్ష్మి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు సభ్యులు గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి లక్ష్యాలు, పారదర్శక పరిపాలన విధానం, పంచాయతీరాజ్ వ్యవస్థ బాధ్యతలు వంటి అంశాలపై సభ్యులకు విస్తృతంగా శిక్షణ అందించినట్లు తెలిపారు.గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు సిద్ధం చేయడం, నిధుల సమర్థ వినియోగం, పారిశుధ్య నిర్వహణ, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినట్లు వెల్లడించారు. శిక్షణతో సభ్యుల్లో బాధ్యతాభావం పెంపొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం శిక్షణ పూర్తి చేసిన వార్డు సభ్యులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి షబానా, మండల పరిషత్ పర్యవేక్షకులు, పది గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కంపెనీకి దాసోహం

- ఆయిల్ ఫేడ్ ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోంది
- రైతును నష్టపరిచి కార్పోరేట్లకు అండగా నిలుస్తున్నారు....
- ఆయిల్ ఫామ్ గ్రోయర్స్ అధ్యక్షా, కార్యదర్శులు తుంబురు ఉమామహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 27, ప్రజాజ్యోతి :** ఆయిల్ ఫేడ్ ని నిర్వీర్యం చేసి ఓ ప్రైవేట్ కంపెనీకి పామాయిల్ రైతులను దాసోహం చేసే ప్రక్రియ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నడుస్తుందని, దీనికి ప్రభుత్వ పెద్దలు అధికారులు పూర్తిగా సహకారం అందిస్తున్నారని తెలంగాణ ఆయిల్ ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫామ్ గ్రోయర్స్ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి కొక్కెరపాటి పుల్లయ్యలు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో ఆర్ అండ్ బి అతిథి గృహ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 12 అంశాలపై వారికున్న అనుమానాలను, వాటి వల్ల రైతులకు కలిగే నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓ ప్రణాళిక ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ ఫేడ్ను నష్టపరిచి తద్వారా ప్రవేట్ కంపెనీలకు ధారాధత్నం చేసేలా ప్రభుత్వ పెద్దలు వ్యవహరిస్తున్నారన్నారు. 13 ప్రైవేట్ ఆయిల్ ఫామ్ కంపెనీస్ హైకోర్టులో ఆయిల్ ఫామ్ గెలల కొనుగోలుకు కొలబద్దయిన ఓ ఈ ఆర్ నిర్ధారించే పద్ధతిని మార్చమని కేసు వేశారని ఈ పద్ధతి మారితే రైతులకు ప్రైవేటు కంపెనీలు రైతులకు తక్కువ రేటు చెల్లించే ప్రమాదం ఉందన్నారు. గత పది సంవత్సరాలుగా రైతుల పక్షాన పోరాటాలు చేస్తున్నామని మా పోరాటాల ఫలితంగా కొన్ని విషయాలపై విచారణ జరిపిన నివేదికలను బయట పెట్టలేదన్నారు. గత ఆరు సంవత్సరాలుగా ఫ్రీ యూనిక్ అనే కంపెనీకి ఏకపక్షంగా టెండర్లను అప్పగిస్తున్నారని దాని ద్వారా ఆయిల్ ఫామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని మేము హెచ్చరిస్తూనే ఉన్నామని ఇప్పుడు అదే ఫ్రీ యూనిట్ కేసు వేయడంతో మేము అనుకున్నదే జరిగిందన్నారు. గత రెండు రోజులుగా ఆయిల్ ఫామ్ నర్సరీలను పరిశీలిస్తున్న ఆయిల్ఫేట్ చైర్మన్ శ్రీ జంగా రాఘవరెడ్డి మొక్కల పెంపకంపై నాణ్యత, పారదర్శకత, రైతు శ్రేయస్సు మా నినాదం అని పత్రికాముఖంగా చెబుతున్నారని మేము ఆయిల్ ఫామ్ రైతులకు ఆయిల్ ఫామ్ నర్సరీని చూసేందుకు అనుమతి ఇవ్వమని ఆయిల్ పేడ్ ఎండి జి ఎం చైర్మన్ లకు ఉత్తరాలు రాసిన ఇప్పటివరకు స్పందించలేదన్నారు. ఇప్పటివరకు ఆయిల్ ఫామ్ లో వందత్వ మొక్కలు లేవని చెప్పిన వారు 29 వేల ఆఫ్ టైపు మొక్కలను ఆయిల్ ఫిట్ జెసిబి లతో తొలగించామని చెప్పటం దేనికి సంకేతమన్నారు. ఆయిల్ ఫిడ్ ఆయిల్ ఫామ్ కలెక్షన్ సెంటర్స్ కుంభకోణనికి నిలయాలుగా మారాయని ఎలాంటి టెండర్లు లేకుండా పార్టీ కార్యకర్తల పునరావాసానికి ఆయిల్ ఫేడ్ ని వాడుతున్నారన్నారు. త్వరలోనే పూర్తి వివరాలతో ఆయిల్ ఫెడ్ లో జరిగే అక్రమాలను నిరూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కారం శ్రీరాములు, చెలికాని సూరిబాబు,దొడ్డ లక్ష్మీనారాయణ,మోరంపూడి శ్రీనివాసరావు,కలపాల భద్రయ్య,తలశీల ప్రసాద్,దండు రామరాజు, పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల వేతనాలపై విద్యా కమిషన్ చైర్మన్ వ్యాఖ్యలు విచారకరం

- విద్యా కమిషన్ సిఫారసులపై తక్షణమే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలి
- టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు
- బి రాజు మురళీమోహన్




**పాల్వంచ, ఫిబ్రవరి 27, ప్రజా జ్యోతి** తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సమర్పించిన విద్యా విధాన పత్రం 2026 ను అమలు చేసే ముందు ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు, శుక్రవారం జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి రాజు, మురళీమోహన్లు మాట్లాడుతూ కమిషన్ సిఫార్సులలో కొన్ని ప్రభుత్వ విద్యారంగానికి మేలు చేసే విధంగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు సంబంధించి వారు చేసిన సిఫారసులు చాలావరకు అభ్యంతరకరంగా ఉన్నాయని ,ఇవి ఉపాధ్యాయుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని, ఇలాంటి సిఫార్సుల విషయంలో విద్యా కమిషన్ చైర్మన్ పునరాలోచించుకోవాలని టీఎస్ యుటిఎఫ్ డిమాండ్ చేస్తుందన్నారు, కమిషన్ సిఫారసులు ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని పెంచేవిగా ఉపాధ్యాయ వృత్తిలోకి మరింత ఎక్కువమంది వచ్చే విధంగా ఉండాలంటే అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తికి ఎక్కువ వేతనాలు ఉండాలనే జాతీయ కమిషన్ (కొఠారి కమిషన్) సూచనలకు భిన్నంగా సిఫారసు చేయడం విచారకరమని, ఉపాధ్యాయ సంఘాలు సాధించుకున్న ఈ అరకొర సౌకర్యాలను కూడా కమిషన్ చాలా ఎక్కువ అనే దృష్టితో వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు, ఉపాధ్యాయుల వేతనాలు అనేవి ప్రత్యేకంగా ప్రభుత్వాలు ఇచ్చేవి కావని ,రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ వర్తించేలా పి ఆర్ సి సిఫారసు మేరకే ఇస్తారనే విషయాన్ని మరచి వేతనాలను తగ్గింపు గాని, అప్రెంటీస్ విధానాన్ని సిఫారసు చేయడం గాని ఏమాత్రం సమర్ధనియం కాదని, రాష్ట్ర ప్రభుత్వంలో అధికారులుగా ఉన్న వారి వేతనాలతో సౌకర్యాలతో పదోన్నతి అవకాశాలతో పోల్చి చూసినప్పుడు ఉపాధ్యాయుల వేతనమును ఆర్థిక కోణంలో కాకుండా సామాజిక హోదా కోణంలో పరిశీలించాలని డిమాండ్ చేశారు, అదేవిధంగా ఒక క్రింది స్థాయి ఉద్యోగిగా నియామకమైన వారు రిటైర్మెంట్ లోగా ఉన్నతాధికారిగా పదోన్నతులు పొందగలిగే అవకాశం అనేక డిపార్ట్మెంట్లలో ఉన్న సందర్భంలో ఉపాధ్యాయులు మాత్రం నియామకం నుండి రిటైర్మెంట్ వరకు ఒకే హోదాతో పని చేస్తారు కావున వారికిచ్చే వేతనాన్ని ఆర్థిక కోణంలో కొలవడం సరైనది కాదని, అలాగే కమీషన్ సిఫారసులలో ఉపాధ్యాయుల ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ రద్దు, ఉపాధ్యాయుల 50 శాతం పదోన్నతి పై ఉపాధ్యాయుల ప్రమోషన్లకు పనితీరును కొలమానంగా తీసుకోవాలనే సిఫారసులు తీవ్ర అభ్యంతరకరమని, ఇలాంటి సిఫార్సుల్ని కార్పొరేట్ కంపెనీల కల్చర్ లో భాగంగా చూడాల్సి వస్తుందని అభిప్రాయపడుతున్నామన్నారు ,అదే సందర్భంలో పాఠశాల మౌలిక వసతుల విషయంలో ముఖ్యంగా ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం, విద్యారంగానికి 18 శాతం బడ్జెట్ కేటాయింపు, శిశు కేంద్రీకృత విద్యా విధానం లాంటి వారు చేసిన సిఫార్సులను స్వాగతిస్తున్నామనీ, అయితే కమీషన్ సిఫారసులతో విద్యారంగానికి ఒరిగేదేమీ లేదని దాన్ని అమలుపరచడంలో ప్రభుత్వాల చిత్తశుద్ధి పై ఆధారపడి ఉంటుందని ,రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలంటే ప్రస్తుతం ఉన్న 7.5శాతం బడ్జెట్ను వచ్చే బడ్జెట్లో విద్యారంగానికి వారి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం కనీసం 15 శాతానికి తగ్గకుండా బడ్జెట్ కేటాయింపులు చచేయాలన పరువు డిమాండ్ చేశారు , ఈ సమావేశంలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా నాయకులు మల్లెంపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు